ప్రజాశక్తి
బుధవారం 26 మార్చి 2025
5
విజయనగరం

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న రెండు రోజుల జిల్లా కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

సర్వేలతో ఉక్కిరి బిక్కిరి

పూసపాటిరేగ మండలంలో సర్వే చేస్తున్న సిబ్బంది

- ఒత్తిడి తట్టుకోకపోతున్నామంటూ ఎంపిడిఒలకు వినతులు
- సచివాలయ ఉద్యోగుల దుస్థితి
- పథకాల కత్తిరింపుకేనా సర్వేలు ?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / పూసపాటి రేగ

రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి సుమారు తొమ్మిది నెలలు కావచ్చింది. ఇటీవల కాలంలో అనేక అంశాలపై చేపడుతున్న సర్వే సచివాలయ ఉద్యోగులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జిల్లాలో 530 గ్రామ సచివాలయాలు, 96 వార్డు సచివాలయాలు మొత్తం 626 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 5800 మంది ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారు. పరిధి మాత్రం 777 గ్రామ పంచాయతీలు, 983 రెవెన్యూ గ్రామాలు, 1723 మధుర గ్రామాలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కలు ప్రకారం 4.85లక్షల కుటుంబాలు, 19.13లక్షల జనాభా ఉన్నారు. 2011 తరువాత ఇందులో 4వ వంతు జనాభా, కుటుంబాలు పెరిగినట్లు అంచనా. ఇన్ని కుటుంబాలను సర్వే చేయడం కష్టంగా తరంగా ఉందని సచివాలయాల సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పించన్ల ప్రక్షాళన పేరిట మోడల్ సర్వేలు నిర్వహించారు. ఇంకా కొనసాగు తోంది. ఇది పూర్తికాకముందే పేదలను గుర్తించే పేరిట పి-4 సర్వే చేపట్టారు. మరోవైపు మిస్సింగ్ సిటిజన్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయిస్ సర్వే, వర్క్‌ఫ్రం హోం, హౌస్ హోల్డ్ జియోట్యాగింగ్, డెత్ వెరిఫికేషన్, ఆరేళ్లపిల్లల ఆధార్ మిసింగ్ సర్వే, నాన్ రెసిడెన్సియల్ సర్వే, గృహ వినియోగ సర్వే, ఉద్యోగిత-నిరుద్యోగిత రేటు, సమయ వినియోగ సర్వే, పంట దిగుబడి సర్వే, సూక్ష్మ, చిన్న, మధ్య, చిన్న తరహా పరిశ్రమల వార్షిక సర్వే, ఫార్మర్ ఐడెంటిటీ వంటి సర్వేలతో పాటు ఇంటి పన్ను, కుళాయి పన్ను వసూళ్ల వంటివి కూడా ఏకకాలంలో చేయ లేక పోతున్నా మని సచివాలయ సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా సచివాలయం పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఎఎన్ఎంలు, మహిళా పోలీస్, ఆర్‌బికెలో అగ్రికల్చర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు, విలేజ్ అసిస్టెంట్లు, విఆర్ఒల వరకు ఇవే ప్రధానమైన పనులుగా ఉన్నాయి. ఒకటి కాదు, రెండు కాదు పదుల సంఖ్యలో సర్వేలు నిర్వహిస్తున్నారు. ఇవన్నీ సెల్‌ఫోన్ లేదా ట్యాబ్ వంటి సాంకేతిక పరికరాలను ఉపయోగించాల్సి నవే. సంబంధిత ఇళ్ల వద్ద నెట్ వర్కు లేకపోయినా, కుటుంబ సభ్యులెవరూ ఇళ్ల వద్ద లేకపోయినా తిరిగి వెళ్లాల్సిందే. ఒకవేళ నెట్ వర్కు ఉన్నా కుటుంబ సభ్యులు సకాలంలో స్పందించి ఒటిపిలు చెప్పాలి. లేదంటే తిరిగి ప్రయత్నించడం తప్పదు. పి-4 వంటి సర్వేలు చేయాలంటే మొత్తం 27 అంశాలతో కూడిన ఫార్మెట్‌ను ఆన్‌లైన్‌లో నింపాలి. తీరా ఇది పూర్తయ్యాక ఒటిపి వెంటనే రాకపోయినా, కుటుంబ సభ్యులు సకాలంలో రెస్పాండ్ కాకపోయినా అంతే సంగతులు. వర్కు ఫ్రం హోం సర్వే చేయాలంటే తప్పనిసరిగా రాత్రి వేళల్లో మాత్రమే వెళ్లాల్సి ఉంటుందని, పగటిపూట వారంతా నిద్రలో ఉంటున్నారని ఉద్యో గులు చెబు తున్నారు. ఇలాంటి సర్వేలన్ని ఒటికీ పంచా యతీ కార్య దర్శులు, విఆర్ఒ లను ప్రధాన బాధ్యులు గా చేస్తు న్నారు. వాస్తవా నికి గతంలో ఇటువంటి సర్వే లు నిర్వహించి నప్పటికీ ఒకదాని తరువాత మరొకటి నిర్వహించేవారని, అది కూడా ప్రతి 50ఇళ్లకు ఒకరు చొప్పున ఉండే వాలంటీర్లు ప్రాథమిక సమాచారం సేక రిస్తే, సంబంధిత విభాగం అసి స్టెంట్ సాయం తో డిజిటల్ అసిస్టెంట్లు కంప్యూటరీ కరణ చేసేవారని గ్రామ సచివా లయ ఉద్యోగు లు చెబు తున్నారు. ఇన్ని సర్వేలు ఒకేసారి నిర్వహించడం వల్ల ఏ ఒక్కటీ పూర్తిచేయలేకపోతున్నామని కూడా వీరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఒత్తిడి మేరకు అధికారులు మాత్రం గ్రామ కార్యదర్శులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఈ ఒత్తిడి భరించలేని పంచాయతీ కార్యదర్శులు జిల్లా వ్యాప్తంగా ఎంపిడిఒలకు కొద్దిరోజుల క్రితం వినతి పత్రాలు సమర్పించారు. సర్వే ఒత్తిళ్లు తగ్గించాలని, లేదంటే తప్పులు లేకుండా చేయలేమని అందులో పేర్కొంటున్నారు.

> గత ప్రభుత్వ పథకాలు అమలు కాలేదు. కొత్త పథకాల అమలు కనుచూపు మేర కనిపించడం లేదు. కానీ, టిడిపి కూటమి ప్రభుత్వం సర్వేలపై సర్వేలు నిర్వహిస్తోంది. సర్వేలు నిర్వహించడం తప్పేమీ కాదు. కానీ, ఒకేసారి పదుల సంఖ్యలో సర్వేలు నిర్వహించడం ఎంత కష్టమో చేసినవారికి తెలుస్తుంది. సిబ్బంది మెడపై కత్తిపెట్టి చేయించిన వెబ్‌ల్యాండ్ నమోదు, రీసర్వేలు వంటి ఫలితాలు ఎలా వచ్చాయో వేరేగా చెప్పనక్కర్లేదు. వీటి నుంచి గుణపాఠం నేర్చుకుని తప్పులు లేకుండా, ఒత్తిడి చేయకుండా జరిపాల్సిన సర్వేలనే ఆఘమేఘాలపై నిర్వహించేందుకు సచివాలయ ఉద్యోగులపై తీవ్రమైన ఒత్తిడి చేయడంతో బెంబేలెత్తి పోతున్నారు.

అవిశ్వాసానికి రంగం సిద్ధం

20 మంది కౌన్సిలర్ల సంతకాలతో కలెక్టర్‌కు లేఖ అందజేత

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి వైసిపి, టిడిపి కౌన్సిలర్లు రంగం సిద్ధం చేశారు. మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణపై సొంత పార్టీ కౌన్సిలర్లు అసంతృప్తి చెంది టిడిపి కౌన్సిర్ల మద్దతుతో అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే సుజయకృష్ణ రంగారావు అనుమతితో 10మంది టిడిపి కౌన్సిలర్లు, 10మంది వైసిపి కౌన్సిలర్లు, సంతకాలతో జిల్లా కలెక్టర్ అంబేద్కర్‌కు అవిశ్వాస తీర్మానం లెటర్ అందజేసినట్లు తెలిసింది. వైసిపి కౌన్సిలర్లతో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంతనాలు జరిపినప్పటికీ వెనక్కి తగ్గకుండా అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ముందుకు వెళ న్నారు.

టిడిపి అభ్యర్థికి చైర్మన్ పదవి ఇచ్చేందుకు అంగీకారం

వైసిపి చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణపై అసంతృప్తి పెరగడంతో ఆయనపై అవిశ్వాస తీర్మానం పెట్టి టిడిపి నిర్ణయించిన అభ్యర్థికి చైర్మన్ పదవి ఇచ్చేందుకు వైసిపి కౌన్సిలర్లు అంగీకరించినట్లు తెలిసింది. మున్సిపాలిటీలో 31మంది కౌన్సిలర్లు ఉండగా వైసిపి కౌన్సిలర్ మరిశర్ల రామారావు రాజీనామా చేశారు. మిగిలిన 30మంది కౌన్సిలర్లలో 10మంది టిడిపి, 20మంది వైసిపి కౌన్సిలర్లు ఉన్నారు. వైసిపి 20మంది కౌన్సిలర్లలో 10మంది అసంతృప్తితో ఉండడంతో వీరంతా అవిశ్వాస తీర్మానానికి సిద్ధమై టిడిపి కౌన్సిలర్లను సంప్రదించగా వారు కూడా సై అనడంతో చైర్మన్ పదవిని టిడిపి కైవసం చేసుకునేందుకు ప్రణాళిక వేసింది.

తీర్మానాన్ని ఓడించేందుకే వైసిపి ప్రయత్నం

మున్సిపల్ చైర్మన్‌పై అసంతృప్తితో ఉన్న కౌన్సిలర్లతో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు చర్చలు జరిపారు. చైర్మన్ పదవి నుంచి సావు వెంకట మురళీకృష్ణను తొలగించి వైసిపిలో ఉన్న వేరే కౌన్సిలర్‌ను చైర్మన్‌గా నియమించాలని కౌన్సిలర్లు షరతు పెట్టినప్పటికీ మాజీ ఎమ్మెల్యే శంబంగి అంగీకరించక పోవడంతో టిడిపి కౌన్సిలర్లతో కలిసి అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధమయ్యారు. అవిశ్వాస తీర్మానాన్ని ఎలాగైనా ఓడించాలని ప్లాన్ లో వైసిపి పెద్దలు ఉన్నారు. అవిశ్వాస తీర్మానం సమావేశానికి 20మంది కౌన్సిలర్లు హాజరైతేనే కోరం సరిపోతుంది. ఒక్క కౌన్సిలర్ సమావేశానికి గైర్హాజరు అయితే కోరం చాలక సమావేశం వాయిదా పడుతుంది. ఒక్కసారి సమావేశం వాయిదా పడితే మరో ఏడాది వరకు సమావేశం నిర్వహించే అవకాశం లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 30 మంది కౌన్సిలర్లలో వైసిపిలో కొనసాగుతున్న 10మంది కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరై అసంతృప్తి కౌన్సిలర్లలో ఒక్క కౌన్సిలర్‌ను తమవైపు తిప్పుకుని సమావేశానికి గైర్హాజరైనట్లు చేసి, కోరం లేకుండా చేసేందుకు వైసిపి ప్రయత్నం చేస్తుంది. 10మంది అసంతృప్తి కౌన్సిలర్లలో ఒక్క కౌన్సిలర్ గైర్హాజరైతే వైసిపిలో ఉన్న మరో కౌన్సిలర్‌ను సమావేశానికి వచ్చేలా చేసి అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గాలని టిడిపి ప్రయత్నం చేస్తుంది. చైర్మన్ పదవిని వదలకుండా వైసిపి ఎత్తులు వేయగా ఎలాగైనా చైర్మన్ పదవిని కైవసం చేసుకునేందుకు టిడిపి ఎత్తుకు పై ఎత్తులు వేస్తుంది.

టిడిపి కౌన్సిలర్లతో సమావేశం

కోటలో టిడిపి కౌన్సిలర్లతో ఎమ్మెల్యే బేబినాయన, మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు సమావేశమయ్యారు. కౌన్సిలర్లతో అవిశ్వాస తీర్మానంపై చర్చలు జరిపారు. అవిశ్వాస తీర్మానాన్ని ఎలాగైనా నెగ్గాలని టిడిపి కౌన్సిలర్లకు ఎమ్మెల్యే, మాజీమంత్రి సూచనలు జారీ చేసినట్లు తెలిసింది.

పట్టణంలో రాజకీయ వేడి

మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధమవ్వడంతో పట్టణంలో రాజకీయ వేడి నెలకొంది. బొబ్బిలి మున్సిపాలిటీని టిడిపి కైవసం చేసుకుంటే బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం మండల పరిషత్‌లను కూడా కైవసం చేసుకుంటారని చర్చ జరుగుతుంది.

31లోపు పన్ను చెలిస్తే 50శాతం వడ్డీ రాయితీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర ప్రజలు ఆస్తి పన్ను బకాయిలను ఈనెల 31లోగా ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించి వడ్డీలో 50శాతం రాయతీ పొందవచ్చునని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. బకాయిలు చెల్లించిన వారికి 50శాతం వడ్డీ రాయితీ మొత్తాన్ని వచ్చే ఆర్థిక సంవత్సరానికి చెల్లించవలసిన పన్నులో సర్దుబాటు చేస్తారని వెల్లడించారు. కావున ఇప్పటివరకు పన్నులు చెల్లించని బకాయిదారులు ప్రభుత్వం కల్పించిన 50 శాతం వడ్డీ రాయితీ సౌకర్యాన్ని వినియోగించుకుని బకాయిలన్నీ ఏక మొత్తంగా చెల్లించాలని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని పన్ను బకాయి దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పన్నులను సకాలంలో చెల్లించి నగరపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కెజిబివి ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి దేవానందరెడ్డి

కెజిబివిని సందర్శించిన రాష్ట్ర కార్యదర్శి

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురంలోని కెజిబివిని ఆ పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి డి.దేవానందరెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థినులకు ' ఫారెస్ట్ అండ్ వైల్డ్ లైఫ్ అనే 10వ తరగతి సోషల్ సబ్జెక్టు లోని అంశంపై 20 నిమిషాలు పాటు విద్యార్థినులను చదివించి, గ్రహించిన విషయాన్ని వారితో చెప్పించారు. విద్యార్థినులతో ప్రశ్నలు-సమాధానాలతో నోట్స్ రాయించారు. దీనివల్ల విద్యార్థులు ఒక పుస్తకంలో చదివిన విషయాన్ని ఎలా గ్రహించి, దాన్ని నిత్యజీవితంలో ఎలా అన్వయించుకోవాలో అర్థం చేసుకున్నారు. తరువాత 7వ తరగతి విద్యార్థినులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్ట్స్ మీద డెడికేషన్ టెస్ట్ నిర్వహించి స్వయంగా తనే పేపర్స్ కరెక్షన్ చేశారు. దీని ద్వారా విద్యార్థినుల ఫౌండేషన్ లిటరసీ, నుమరషి స్థాయిలను అంచనా వేశారు. తర్వాత స్టాఫ్ మీటింగ్ నిర్వహించి, సమీక్ష చేసి పలు సూచనలు చేశారు. ఎపిసి ఎ.రామారావు, జిసిడిఒ మాలతి, మండల విద్యాశాఖ అధికారి బి.చంద్రమౌళి, పాఠశాల ప్రిన్సిపాల్ , సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర క్రీడా పోటీల విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గుంటూరులో ఈనెల 19,20,21 తేదీల్లో జరిగిన మహిళా క్రీడా, కల్చరల్ ఇంటర్ సర్కిల్ టోర్నీలో విజయనగరం క్రీడాకారులు విజయం సాధించారు. కల్చరల్ ప్రోగ్రాంలో మోనో యాక్షన్‌లో ఎం.నిర్మలమూర్తి తృతీయస్థానం, లైట్ మ్యూజిక్ సాంగ్స్‌లో ఎ.రామకృష్ణ ప్రథమ స్థానం, ఫోక్ సాంగ్‌లో డి.చిరంజీవులు కన్సులేషన్, , ఇనిస్ట్రిమెంట్‌లో అప్పారావు పతకాలు సాధించారు. మహిళల విభాగంలో.. టెన్నీ కాయిట్ డబుల్స్ లో ఎస్‌వై బాలా కుమారి, బి.లక్ష్మి, ద్వితీయ స్థానం సాధించారు. లాంగ్ జంప్‌లో కె.నవ్య, 100 మీటర్ల పరుగు పందెంలో బి.రోజా తృతీయ స్థానం సాధించారు. మొత్తంగా 9 కప్ లు సాధించారు. పతకాలు సాధించిన ఉద్యోగులను ట్రాన్స్‌కో ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ పి.త్రినాధరావు, జనరల్ సెక్రటరీ వి. మోహన్ బాబు, గేమ్స్ సెక్రటరీ.. కల్చర్ సెక్రటరీ , ఎన్. గణేష్ రావు తదితరులు అభినందించారు. విద్యుత్ అధికారులు అభినం దించారు.

పలు ప్రాంతాలకు నీటి సరఫరా బంద్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మధుపాడ పంపింగ్ లైన్ ద్వారా నీటి పంపిణీ జరుగుతున్న పైపులు కొన్ని లీకు అయినందున కలెక్టర్ ఆఫీస్ ప్రాంతంలో నీటి పంపిణీకి ఆటంకం ఏర్పడిందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. దీనివల్ల నగరంలోని 36, 38, 39, 40,41 డివిజన్లోని కొన్ని ప్రాంతాలకు, 20, 24 డివిజన్లకు నీటి పంపిణీకి ఆటంకం ఏర్పడిందని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపడతామని వెల్లడించారు. అంతవరకు ఇబ్బందులు కలిగిన ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను చేపడతామన్నారు.

వేపాడలో వర్షం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో మంగళవారం మధ్యాహ్నం వడగల్లు, ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో ఎండ తీవ్రతకు ఉక్కబోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. కాగా నువ్వు పంటకు ఈ పంట బాగా అనుకూలంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘోషాలో ఐదునెలల బాలుడు మృతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని దారపర్తి పంచాయతీకి కురిడేబోయిన గంగులు, సీతమ్మ దంపతుల ఐదు నెలల పసి బాలుడు విజయనగరంలోని ఘోషాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశాడు. దారపర్తి పంచాయతీ పరిధిలో గిరిజనుల మరణాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవల ఈ పంచాయతీలోని పలు గ్రామాలలో పిల్లలకు దద్దుర్లు టఎతీవ్రఎ జ్వరాల బారిన పడిన విషయం తెలిసిందే. వైద్యుల నిర్లక్ష్యం బయట పడటంతో జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులు, అధికారులు స్పందించి గ్రామాల్లో పిల్లలకు టీకాలు చేయించారు. అయినా ఇప్పటికే వివిధ చోట్ల చికిత్స పొందుతున్న పిల్లలకు విశ్రమ పరిస్థితి ఎదురవుతూనే ఉంది. అందులో భాగంగానే దారపర్తి గ్రామానికి చెందిన కురిడే బోయిన గంగులు, సీతమ్మ దంపతుల ఐదునెలల పసి బాలుడు ఎస్.కోట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాడు. ఆ చిన్నారిని వైద్యులు విజయ నగరంలోని ఘోషాసుపత్రికి రిఫర్ చేయడంతో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. శృంగవరపుకోట ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వైద్యం అందించక పోవడవం వల్లే చిన్నారి చనిపోయాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఒక గిరిజన మహిళ ప్రసవ సమయంలో చిన్నారి మృతి చెందిన ఘటన మరువకముందే ఈ సంఘటన చోటు చేసుకుంది. ప్రభుత్వం ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గిరిజన చిన్నారుల మరణాలను ఆపాలని ఆదివాసి గిరిజన సంఘం నాయకులు జె.గౌరీష్ డిమాండ్ చేశారు.

మృతి చెందిన బాలుడు (ఫైల్)

నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాషలో శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాషలో ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు స్కిల్బీ సంస్థ ప్రతినిధి ఉజ్వల్ తెలి పారు. మంగళవారం మహారాజా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (మిమ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్) బిఎస్‌సి నర్సింగ్, ఎంఎస్‌సి నర్సింగ్, జిఎన్.ఎం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ సహకారంతో ఎనిమిది నెలల శిక్షణ అనంతరం జర్మనీలో రూ.2.50లక్షలు నుంచి రూ.3.50లక్షలు జీతంతో ఉద్యోగాలు కల్పిస్తామని, వీసా, ప్రయాణ ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని అన్నారు. ఉద్యోగాలు చేయాలనుకున్న వారికి వసతి, ఆరోగ్యబీమా, పించను సదుపాయాలు కల్పిస్తామని జర్మనీ దేశ ప్రతినిధి విక్టోరియా తెలిపారు. కార్యక్రమంలో మిమ్స్ డైరెక్టర్ టి.వేణుగోపాల రావు , ప్రిన్సిపాల్ సంసీర్ భేగం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి.ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యం వీడి సమగ్రాభివృద్ధికి తోడ్పడాలి

పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన 5న సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాలకుల నిర్లక్ష్యం కారణంగానే విజయనగరం సమగ్రాభివృద్ధి సాధ్యం కాలేదని, ఇప్పటి కైనా నిర్లక్ష్యం వీడి సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు కోరారు. మంగళవారం స్థానిక ఎల్ బి జి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకనాడు విద్యలకు నిలయం.. కళల కానాచి చెరుకు, వరి, జనుము, మామిడి, జీడిపంటలకు ప్రసిద్ధిగాంచిన జిల్లా అని, నీటి వనరులు పుష్కలంగా ఉన్నా జిల్లా విజయనగరం అభివృద్ధికి ఆ మడ దూరంలో ఉందని అన్నారు. జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు వలసలు పెరిగిపోయాయని, అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉందని అన్నారు. సాంప్రదాయంగా ఏర్పడ్డ జ్యూట్ పరిశ్రమ, పంచదార పరిశ్రమ, ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. కొత్తగా సముద్రతీరంలో వచ్చిన ఫార్మా కంపెనీలు విషజలాలు వెదజల్లి సముద్రంలోకి పంపేస్తూ పర్యావరణానికి తీవ్రహాని చేస్తున్నారన్నారు. నూతన ఆర్థిక విధానాల ఫలితంగా మల్టీ నేషన్ కంపెనీలు, బడా పెట్టుబడిదారులైన టాటా, అంబానీ, అదానీల షాపింగ్ మాల్స్ రావడంతో ఉన్న చిన్నా, చితక షాపులు మూతపడే పరిస్థితి ఉందన్నారు. వ్యవసాయానికి గిట్టుబాటు ధరల్లేక భూములు రియల్‌ఎస్టేట్ వ్యాపారుల కబంధ హస్తాల్లో చిక్కుకుని పచ్చని నేల బీడుభూమిగా మారిపోయిందన్నారు. పోరాడి సాధించుకున్న మెడికల్ కాలేజీలో ముఖ్యమైన కార్డియాలజి, న్యూరాలజి, యూరాలజి విభాగాలు, కేన్సర్ టెస్టింగ్ సెంటర్ లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సాంస్కృతిక విశ్వవిద్యాలయం కట్టాలనే ప్రజల ఆకాంక్ష నేటికీ నెరవేరలేదని చెప్పారు. గురజాడ అడిటోరియానికి రూ. 5కోట్లు కేటాయించినా నేటికీ నిర్మించలేదన్నారు. ఈనేపథ్యంలో సమగ్రాభివృద్ధికి నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ప్రణాళికను ప్రభుత్వం ప్రకటించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగా ఏప్రిల్ 5 న జరగనున్న సెమినార్ ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్, పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర అధ్యక్షులు రంబ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

సర్వేలతో క్షేత్రస్థాయి పరిస్థితుల అధ్యయనం

సహాయ సంచాలకులు రాజశేఖర్

ప్రజాశక్తి-కొత్తవలస

ప్రభుత్వం నిర్వహించే వివిధ సర్వేల ద్వారా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేస్తున్నామనినేషనల్ శాంపిల్ సర్వే సంస్థ సహాయ సంచాలకులు రాజశేఖర్ చెప్పారు. సర్వలే వివిధ ప్రణాళిలను రూపొందించేందుకు, విధాన పరమైన నిర్ణయాలను తీసుకొనేందుకు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ గణాంక శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ శాంపిల్ సర్వే సంస్థ వజ్రోత్సవాల్లో భాగంగా కంటకాపల్లి గ్రామ సచివాలయం వద్ద వివిధ వర్గాల ప్రజలకు సర్వేలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడి రాజశేఖర్ మాట్లాడుతూ, తమ సంస్థ కార్యక్రమాలు, నిర్వహిస్తున్న సర్వేల గురించి వివరించారు. గృహ వినియోగ సర్వే, ఉద్యోగిత-నిరుద్యోగిత రేటు, సమయ వినియోగ సర్వే, పంట దిగుబడి సర్వే, సూక్ష్మ, చిన్న, మధ్య, చిన్న తరహా పరిశ్రమల వార్షిక సర్వేల గురించి వివరంగా తెలియజేశారు. ఈ అవగాహనా కార్యక్రమంలో తాహశీల్దారు బి.నీలకంఠారావు, ఎంపిడిఒ ఎస్.రమణయ్య, సర్పంచ్ ఎం.లక్ష్మి, ఎఎస్ఒ సన్యాసినాయుడు, ఎన్ఎస్ఒ ఎస్ఎస్ఒ ఎస్.పాలకం రాజు, ప్రణాళికా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడతున్న సర్వేశాఖ ఎడి

చలివేంద్రాల ఏర్పాటుక ముందుకు రావాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వేసవి దృష్ట్యా ఎండలు తీవ్రతరమవు తున్న నేపథ్యంలో నగరంలో విరివిగా చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు, పారిశ్రామిక సంస్థలు, ఉత్సాహవంతులు ముందుకు రావాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. వేసవి తాపానికి ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ఎక్కడికక్కడ చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. చలి వేంద్రాలు ఏర్పాటు చేస్తే నగరపాలక సంస్థ ట్యాంకర్ల ద్వారా అందిస్తామని వెల్లడించారు. ఉత్సాహవంతులైన వారు చలివేంద్రాల వద్ద మంచినీటితో పాటు మజ్జిగ, ఒఆర్ఎస్ ప్యాకెట్లు వంటివి కూడా అందించవచ్చని తెలిపారు.

జెఎన్‌టియులో ముగిసిన సాంకేతికోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఇఐఎస్ఇఎన్ 2కె 25 సాంకేతికోత్సవ ముగింపు మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం విద్యార్థులకు తాజా సాంకేతికతపై అవగాహన పెంచడానికి, పరిశ్రమ నిపుణులతో మమేకం కావడానికి, నూతన నైపుణ్యాలను అభివద్ధి చేసుకోవడానికి ఒక ముఖ్యమైన వేదికగా నిలిచింది. ఈ వేడుకకు ముఖ్య అతిదిగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి ఆచార్య వివిఎస్ఎస్ఎస్ శ్రీకాంత్ హాజరయ్యారు. విశిష్ట అతిధులుగా అశోక్ లేలాండ్ నుంచి డాక్టర్ జివి శరత్ కుమార్ , జెఎన్‌టియు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జి.జయసుమ , గౌరవ అతిధులుగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జిజె నాగ రాజు , లోహ సంగ్రహణ శాస్త్ర విభాగ అధిపతి, ఐఎస్ఇ ఎన్ 2కె 25 సమన్వయకర్త డాక్టర్. కె.శ్రీనివాస ప్రసాద్ హాజరయ్యారు. విశిష్ట అతిధి డాక్టర్ జివి శరత్ కుమార్ 'ఫెయిల్యూర్ అనాలిసిస్ అఫ్ ఇండస్ట్రియల్ కాంపోనెంట్స్' అనే అంశంపై మాట్లాడారు.

తోటపాలెం గాయత్రి కాలేజీలో నేడు డిగ్రీ క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి-విజయనగరం

తోటపాలెం గాయత్రి డిగ్రీ కాలేజీలో బుధవారం సాఫ్ట్‌వేర్, ఫార్మా, మ్యానిఫేక్చర్ ఫార్మా , బిపిఒ కంపెనీలు ఆధ్వర్యంలో క్యాంప్‌స్ ఇంటర్వూలు నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ గౌరి, కరస్పాండెంట్ ప్రసాదరావు తెలిపారు. రెండు లక్షలు నుంచి ఐదు లక్షలు వరకు ప్యాకేజి ఉంటుందని, పది, ఇంటర్, డిగ్రీ, డిప్లమా, ఐటిఐ చదివిన విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. అభ్యర్థులు ఉదయం 9గంటలకు హాజరు కావాలని కోరారు.

గౌరీ సేవా సంఘం ఆధ్వర్యాన ఉగాది కానుకలు పంపిణీ

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

నగరంలో ఎన్‌సిఎస్ థియేటర్ ఎదురుగా ప్రతిరోజూ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న దాన కేంద్రం వద్ద గౌరీయుల కుటుంబాలకు గంటల పంచాంగం, ఉగాది పచ్చడి తయారీలో వాడే ముఖ్యమైన మామిడి కాయలు, బెల్లాలను ఒకకిట్‌గా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ గౌరీ సేవా సంఘం అధ్యక్షులు ఎంకె బి శ్రీను మీడియాతో మాట్లాడుతూ ఉగాదిని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సంఘ గౌరవ అధ్యక్షులు కాండ్రేగుల శేఖర్ పర్యవేక్షణలో నాలుగేళ్లగా ప్రతీ రోజు వంద మంది పేదలకు అన్నదానం చేస్తున్నామని తెలిపారు, ప్రధాన కార్యదర్శి మొల్లేటి చిన్నారావు నాయుడు పర్యవేక్షణ లో నగరంలో చనిపోయిన వారిని ఎవరినైనా స్వర్గ ధామాలకు తరలించడానికి ఉచితంగానే సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అడారి నాగేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి మొల్లేటి చిన్నా రావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహన ర్యాలీ

రేగిడి: మండలంలోని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ఎస్ చెలమయ్య, రీనా చౌదరి ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం పై సోమవారం ఆ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధిని అంతం చేయడానికి ప్రజలందరూ సహకరించాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జలుబు తగ్గడం, సాయంత్రం పూట జ్వరం, దగ్గినప్పుడు కఫంతోపాటు రక్తం పడటం వంటి వ్యాధి లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా కఫం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత ఆరు నెలలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. పౌష్టికాహారం నిమిత్తం వెయ్యి రూపాయలు ప్రతినెల వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి రాధాకృష్ణ, పిహెచ్ఎన్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి కుళాయిలు ప్రారంభం

దెంకాడ: మండలంలోని అక్కివరంలో తాగునీటి ఇబ్బంది రాకుండా గ్రామంలోని బీసీ కాలనీలో కుళాయిలను మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా నివారణ చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా గ్రామంలో బీసీ కాలనీలో 3 లక్షల రూపాయలతో మినీ ట్యాంక్ ను నిర్మించి దాని ద్వారా గ్రామంలో ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కంది సూర్యనారాయణ, సర్పంచ్ కంది కిరణ్‌కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

దెంకాడ: మండలంలోని మోదవలస గ్రామంలో పోలీసు చట్టాలపై భోగాపురం రూరల్ సిఐ జి రామకృష్ణ ప్రజలకు సోమవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల దృష్ట్యా గ్రామంలో ఎటువంటి తగాదాలూ లేకుండా ప్రజలందరూ కలిసి ఉండాలన్నారు. సంకల్పం ద్వారా ప్రతిజ్ఞ చేశారు. దొంగతనాలు రోడ్డు ప్రమాదాలు సైబర్ క్రైమ్, ఎగినెస్ట్ ఉమెన్, క్రికెట్ బెట్టింగ్, సీసీ కెమెరాలు వంటి వాటిపై అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామంలో గంజాయి అమ్మినా, వాడినా కఠినమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పంచాయతీ పరిధిలోని కొండయ్యపాలెం గ్రామంలో ఎస్ఐ సన్యాసినాయుడు పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఏ.సన్యాసినాయుడు, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

నెల్లిమర్ల: వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి తెలిపారు. మంగళవారం ఆమె సతివాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్లు, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి (సిహెచ్ఒ)లు వైద్య సిబ్బంది ఆర్‌సిహెచ్ రిజిస్ట్రేషన్లు, ఆభా ఐ.డి రిజిస్ట్రేషన్లు, ఎన్‌సిడి సిడి కార్యక్రమం గురించి సిబ్బంది దీని నిర్వహణ చేశారు. పిహెచ్‌సి మండల గది, ల్యాబ్‌ను పరిశీలించి, తగు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కె. సాయిరాం, డాక్టర్ అనిల్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదార్ల సంస్థ ఏర్పాటు

నెల్లిమర్ల: సతివాడలో మంగళవారం నాబార్డ్ సహకారంతో (బ్రిడ్జ్) సంస్థ ఆధ్వర్యంలో శుభోదయం రైతు ఉత్పత్తి దారుల సంస్థ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాబార్డ్ డిడిఎం ఎస్.నాగార్జున, డిఎంఐ జోనల్ అధికారి గోఖలే, బ్రిడ్జ్ సిఇఒ రామకృష్ణరాజు సంస్థ ఏర్పాటు నిర్వహణ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పిఒ డైరెక్టర్ అంబళ్ళ శ్రీరాములునాయుడు, సర్పంచ్ రేవల్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి రెడ్డి సత్య నారాయణ, ఎఫ్‌పిఒ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లు పరిశీలించిన జెడ్‌పి సిఇఒ

భోగాపురం: ఈనెల 27వ తేదీన జరగబోయే భోగాపురం మండల పరిషత్ వైస్ ఎంపిపి ఎన్నికకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా పరిషత్ సిఇఒ బివి సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ఎన్నికలకు హాజరయ్యే ఎంపిటిసిలకు గుర్తింపు కార్డులు అందజేయాలని ఎంపిడిఒ గాయత్రిని ఆదేశించారు. ఎన్నిక నిర్వహించే సమావేశ మందిరంలో ఎంపిటిసిలు కూర్చునే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎన్నిక సజావుగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో పరిపాలన అధికారి కామేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ చిన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

రాజాం: మండలంలోని ఒమ్మి గ్రామానికి చెందిన జనసేన మండల నాయకులు చిట్టిరి నాగరాజు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ మేరకు మంగళవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ ఆయన్ను తన నివాసంలో పరామర్శించారు. నాగరాజు కుటుంబ సభ్యులను ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కార్యకర్త కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ పరామర్శలో జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి యాటి రాజు, మామిడి ఆనందబాబు, గెడ్డపు నీలకంఠం, వంగ వెంకటరావు కూటమి నాయకులు పాల్గొన్నారు.

రహదారి కోసం ఎమ్మెల్యేకు వినతి

భోగాపురం: విమానాశ్రయానికి వెళ్లే రహదారిలో తమ పొలాల్లోకి వెళ్ళేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని రైతులు ఎమ్మెల్యే లోకం మాధవిని కోరారు. ఈ సందర్భంగా ఆమెను కలిసి వినతి పత్రం అందజేశారు. విమానాశ్రయానికి వెళ్లే రహదారికి ఆనుకొని తమ భూములు ఉన్నాయని రహదారి నుంచి తమ భూముల్లోకి వెళ్లేందుకు అవకాశం లేకుండా చేస్తున్నారని రైతులు వాపోయారు. ఏకంగా ఇనుప కంచె వేయడం వల్ల రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బందుల గురవుతామని ఆమెకు విన్నవించారు. రైతులు తమ పొలాల్లోకి వెళ్లే విధంగా రహదారి సౌకర్యం కల్పించాలని రైతులంతా కోరారు. నాయకులు మట్టా అయ్యప్ప రెడ్డి, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, యర్రప్ప నారాయణ, పల్లా అప్పన్న రెడ్డి, పిల్ల రాము, కర్రి రామ్మూర్తి, రైతులు బైరెడ్డి లక్ష్మణ, సిరిపో సూరి తదితరులు ఎమ్మెల్యేను కలిశారు.

విద్యార్థి వైద్య ఖర్చులకు ఉపాధ్యాయుల ఉదారత

నెల్లిమర్ల: మండలంలోని మొయిద జడ్‌పి ఉన్నత పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి జరజాపు జస్వంత్ (12) జీవనపర్యాప్తంగా సమస్యలు ఉండటంతో గుండె సంబంధిత అనారోగ్యం బాధపడుతున్నాడు. విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఈ విద్యార్థి ఆ పాఠశాల హెచ్ఎం బేతా మహాలక్ష్మి, ఉపాధ్యాయులు పెద్ద మనసు చాటారు. విద్యార్థి ఆజయ్ వైద్య ఖర్చులకు లక్షల్లో ఖర్చు అవుతుండడంతో తాము విరాళాలు సేకరించిన 45వేల రూపాయలను ప్రధానోపాధ్యాయిని మహాలక్ష్మితో పాటు పలువురు ఉపాధ్యాయులు మంగళవారం విశాఖలోని ఆసుపత్రికి వెళ్లి ఆజయ్ తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాళ్ల అప్పారావు, భోగాపురపు శ్రీనివాసరావు, బొంతు వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు మృతి

వేపాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోలజీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న డి. కన్నయ్య (కిషోర్) పక్షవాతంతో మృతి చెందారు. గత నెల 27వ తేదీన పక్షవాతం రావడంతో విశాఖపట్నంలో ప్రైవేటు ఆసుపత్రిలో (12) రోజుల చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆయనకి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈయన అల్లూరి సీతారామ జిల్లా అనంతగిరి మండలం జీనపాడు గ్రామానికి చెందిన వ్యక్తిగా చెబుతున్నారు.

అపార్ట్‌మెంట్‌పై నుంచి జారి పడి వృద్ధుడి దుర్మరణం

బొబ్బిలి: పట్టణంలోని నాయుడు కాలనీలో అపార్ట్‌మెంట్‌పై నుంచి జారిపడి రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు యజ్జల శ్యామసుందరరావు(82) మృతి చెందారు. వంగపండు అపార్ట్‌మెంట్లో నివాసముంటున్న శ్యామసుందరరావు కొద్ది రోజులుగా మతిస్థిమితం కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారు. అపార్ట్‌మెంట్ పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని కుమారుడు మంగళవారం ఆక్కడికక్కడే మృతి చెందారు. ఉన్నారు. కోడలు గ్రేస్ కుమారి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఆర్.రమేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

రాజాం: రాజాం నగర పంచాయతీ మల్లికార్జున కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్న కెల్ల లక్ష్మి (43) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి పరిశీలించగా మృతదేహం కనిపించింది. ఆమె శరీరంపై ఎటువంటి గాయాలు లేకపోవడంతో ఆనారోగ్యంతో మరణించిందా? లేక ఎవరైనా చంపేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేతనదారులందరికీ వంద రోజులు పని

ప్రజావేదికలో డ్వామా పీడీ శారదాదేవి

గుర్ల: సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ శారదాదేవి

ప్రజాశక్తి - గుర్ల

మండల స్థాయిలో ప్రతి వేతనదారునికీ 100 రోజులు పని కల్పించాలని డ్వామా పీడీ శారదా దేవి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 42 గ్రామపంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. గ్రామ స్థాయిలో గ్రామసభలు ఏర్పాటు చేసి అక్కడ నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు మళ్ళీ మండల స్థాయిలో సోషల్ ఆడిట్ వాటిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్యుతాపురం, పెనుబర్తి, తాటిపూడి, జమ్మూ, కొండగండ్రేడు, గూడెం, గ్రామలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలపై గ్రామస్థాయి నాయకులు వచ్చి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. ఇది మండల స్థాయి సోషల్ ఆడిట్ అని గ్రామస్థాయి రాజకీయం కాదని అందరూ నిశ్శబ్దం పాటించాలని తమ గ్రామాల్లో వెళ్లి మాట్లాడుకోవాలని ఏదైనా ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదులు అందించాలని ఆమె చెప్పడంతో కార్యక్రమం సజావుగా సాగింది. అప్పట్లో వైసిపి అధికారంలో ఉండగా తమ కార్యకర్తల అన్యాయం జరిగిందంటూ టిడిపి నాయకులు ఒక్కసారిగా కేకలు వేయడంతో అక్కడ గందరగోళం నెలకొని కొంతసేపటి తర్వాత సద్దుమణిగింది. మండల స్థాయిలో జిల్లాలో కల్లా అత్యధిక పనులు గుర్ల మండలం జరిగాయని, 1645 పనులుగాను రూ.31 కోటి దాటి వ్యయం చేసినట్లు ఆమె తెలిపారు. గ్రామస్థాయిలో సక్రమంగా వేతనదారులకు పనులు కల్పించడం విఫలమయ్యారని ఆగ్రహించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పనితీరు సక్రమంగా లేదని సోకేస్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. చాలా వరకు మొక్కలు, రోడ్లు తదితర పనులు సక్రమంగా లేవని, ఎస్‌సి, ఎస్‌టి వికలాంగులకు పూర్తి స్థాయిలో పనులు కల్పించలేదని చెప్పారు. ఇప్పటికైనా రికార్డుల పనితీరు, పనులు సక్రమంగా కల్పించకపోతే అందరిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామస్థాయిలో మస్తర్లు దిద్దుబాట్లు జరిగాయని, కొన్నిచోట్ల చనిపోయిన వారి పేర్లు వలస వెళ్లిన వారి పేర్లతో పనులు కల్పించినట్లు తన దృష్టికి వచ్చిందని పూర్తిస్థాయి దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ కామేశ్వరరావు సోషల్ ఆడిట్ ఎస్ఆర్పి లక్ష్మణరావు, ఎంపిడిఒ శేషు, ఎపిడి పద్మజ ఉపాధి హామీ ఎపిడి విజిలెన్స్ అధికారి శ్రీనివాసు, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, వైస్ ఎంపిపి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా ప్రజావేదిక

గంట్యాడ: మండలంలో 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపిపి పీరుబండి హైమావతి పాల్గొన్నారు. గ్రామాల వారీగా ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ బృందాలు నివేదికను చదివి వినిపించారు. డ్వామా ఏపిడి రమామని, విజిలెన్స్ అధికారి బానోజీరావు, వైసిపి జిల్లా ఎస్‌సి సెల్ చైర్మన్ జైహింద్ కుమార్, ఎంపిడిఒ ఆర్‌వి రమణమూర్తి, ఎపిఒ సుందర్రావు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మజ్జి చిరంజీవిపై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుపై ఎంపిడిఒ శ్యామల కుమారి మంగళవారం విచారణ చేపట్టారు. 2018-19 నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ సరిగా పనులు కల్పించలేదని, జాబు కార్డు ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. జాబ్ కార్డులు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు కొంతమంది విచారణలో తెలిపారు. ఈ అభియోగాలపై ఎంపిడిఒ సచివాలయంలో విచారణ చేపట్టగా స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. రికార్డ్ చేసిన స్టేట్మెంట్ జిల్లా పీడీకి పంపిస్తామని వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ విచారణలో ఎపిఒ సంకా బత్తుల హరినాథ్, ఈసీ రామినాయుడు ఉన్నారు.

ఇకెవైసి చేయించుకోవాలి

వేపాడ: మండలంలోని 3,495 మంది ఇకెవైసి చేయించుకోలేదని వారికి రేషన్ సరుకులు అందవదని ఇంత వరకూ కేవలం 92 మంది మాత్రమే ఇకెవైసి చేయించుకున్నారని మిగిలిన వారంతా ఈనెల 31లోగా చేయించుకోవాలని సిఎస్‌డిటి రామకృష్ణ తెలిపారు. జాబితాలో పేర్లు ఉన్నవారు తప్పనిసరిగా డీలర్ వద్ద ఇకెవైసి చేయించుకోవాలన్నారు.

ఆస్తి పన్ను పెంపు నిలిపివేయాలి : సిపిఎం

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు శంకరరావు, తదితరులు

ప్రజాశక్తి - బొబ్బిలి

గత ప్రభుత్వం పట్టణాలలో ఆస్తి పన్నులు పెంపునకు సంబంధించి మున్సిపల్ సవరణ చట్టం 44/2020 రద్దు చేయాలని ఆస్తి పన్ను పెంపు నిలిపివేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి. శంకరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ చట్టాల్లో సవరణ చేస్తూ గత ప్రభుత్వం 2020 నవంబర్ 11న ఆర్డినెన్స్ 16 /2020 విడుదల చేసిందన్నారు. ఈ సందర్భంగా ఆయన సిపిఎం కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ఆర్డినెన్స్ సవరణ చట్టం 44/2020 అసెంబ్లీలో ఆమోదించారని, అప్పటివరకు ఉన్న అద్దె విలువపై ఆస్తి పన్ను విధానాన్ని మారుస్తూ ఆస్తి విలువ ఆధారంగా పన్ను వేసే విధానాన్ని ఈ చట్టం ద్వారా ప్రవేశపెట్టారని కేంద్ర ప్రభుత్వం నుండి 0.25శాతం అదనపు అప్పు అనుమతి పొందడం కోసం ఈ చట్ట సవరణ చేశారని వెల్లడించారు. కేవలం ఒకసారి అప్పు పొందడం కోసం ప్రజలపై శాశ్వత భారాన్ని మోపే చట్ట సవరణలు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆస్తి విలువ పై పన్ను విధించడం సరైనది కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆస్తి విలువ అనేది రిజిస్ట్రేషన్ సమయంలో రిజిస్ట్రేషన్ విలువ నిర్ణయించడం కోసం ఈ విలువలో ప్రభుత్వాలు దాదాపు ఏటా పెంచుతాయని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇటీవల పెంచిందన్నారు. ఈ విలువకు ఆస్త పన్నులు లింక్ చేయడం వల్ల ప్రభుత్వం క్యాపిటల్ మార్కెట్ విలువ పెంచిన ప్రతిసారి ఆస్తి పన్ను కూడా పెరుగుతుందని అన్నారు. ఏప్రిల్ నుండి 15శాతం ఆస్తి పన్నులు పెంపు లేకుండా తక్షణమే నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలు భారలు మోసే స్థితిలో లేరని, గత ప్రభుత్వం చేసిన కొన్ని నిర్ణయాలను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలు వేసే దాంట్లో మాత్రం రెండు పార్టీలకి తేడా లేదని అన్నారు. ఆస్తి పన్ను పెంపునకు వ్యతిరేకంగా ప్రజలందరూ పోరాటాలకు సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు బి.యుగంధర్, ఎస్. గోపాల్, బి. వెంకటి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రైవేట్ టోల్‌గేట్ వద్ద నిరసన

ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం ప్రైవేట్ టోల్ గేట్ వద్ద సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కార్యక్రమం మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా సిఐటియు నాయకులు చల్లా జగన్ మాట్లాడుతూ రైతులను, ఇల్లు నిర్మించుకుంటున్న పేద కుటుంబాలను మైనింగ్ అధికారులు సహకారంతో ప్రైవేట్ టోల్గేట్ పెట్టి అక్రమంగా వసూలు చేస్తున్నారన్నారు. ఎత్తయిన మడి నుండి పల్లపు మండిలోకి రైతులు మట్టిని తోలుకుంటున్నా, నూతనంగా కట్టుకుంటున్న పునాదుల్లోకి మట్టి తోలుకుంటున్న వారి నుండి మైనింగ్ అధికారులు ప్రైవేట్ టోల్గేట్ సిబ్బంది ద్వారా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఈ చర్యలకు నిరసనగా ఆందోళన చేస్తున్నామని చెపాపఁడ. ఆందోళన చేస్తున్న దగ్గరకు మైనింగ్ అధికారులు వచ్చి రైతులకు, కార్మికులకు ఏ విధమైన న్యాయం చేయకుండా వెనుతిరిగి వెళ్ళిపోవడం అన్యాయమన్నారు. పక్కనే ఉన్న శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలకు మాత్రం ప్రైవేటు టోల్గేట్ లేకుండా కార్యక్రమాలు జరుపుకుంటున్నారని విజయనగరం జిల్లాలోనే ఈ ప్రైవేట్ టోల్గేట్ సిబ్బంది ద్వారా అక్రమంగా వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇక్కడే కాదు జిల్లాలో ఏర్పాటు చేసిన అన్ని ప్రైవేట్ టోల్ గేట్లు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇల్లు పునాదుల్లోకి మట్టి తోలుకున్న డబ్బులు వసూలు చేయడం అన్యాయం కాదా! టోల్ గేట్ పేరుతో ప్రజలను నానా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గేదెల శ్రీను, చలుమూరి, తూర్పాటి సతీష్, పట్రాని కృష్ణ, వల్లంశెట్టి రవి, ఆలమండ రామకృష్ణ, డాన్ శ్రీను, గొర్లె గణేష్, అలమండ శివప్రసాద్, బత్తిన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం నాయకుడు జరతా గౌరీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని దారపర్తి పంచాయతీ చిలకపాడు గ్రామంలో ఆయన మంగళవారం గిరిజనులతో కలిసి నిరసన తెలిపి వేడుకున్నారు. అనంతరం గౌరీష్ మాట్లాడుతూ విజయనగరం జిల్లా రెండుగా విడిపోయిన తర్వాత విజయనగరం పట్టణంలో థర్డ్ క్లాస్ టు టెన్త్ బాలికల ఆశ్రమ పాఠశాల 260 మంది విద్యార్థినీలతో ఇరుకు గదుల్లో అకామిడేషన్ సరిపోక తీవ్రమైన ఇబ్బందికి గురవుతూ తమ చదువులను కొనసాగిస్తున్నారన్నారు. 160 మందికి సరిపడే బిల్డింగ్‌లో 260 మందికి అడ్మిషన్లు చేర్పించి ఆపైన అడ్మిషన్లు వచ్చినా సాలూరు, పార్వతీపురం పంపించే పరిస్థితి గత ఐదేళ్ల నుంచి కొనసాగుతుందన్నారు. ఒక్క ఎస్‌కోట నియోజకవర్గం పరిధిలో నుంచి 160 పైగా గిరిజన విద్యార్థినిలు, విజయనగరం పట్టణంలో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. వీళ్ళందరూ కొండ కోనలు దిగుతూ, తమ పిల్లలను దూర ప్రాంతాలకు పంపిస్తున్నారని, పిల్లలకు ఏమైనా అనారోగ్యం వస్తే, చూసేందుకు వెళ్లిన, తమ స్తోమతకు మించి, కష్టాలు పడుతున్నారని చెప్పారు. అందుకనే ఎస్‌కోట పట్టణ కేంద్రంలో బాలికల ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కు, స్థానిక ఎమ్మెల్యేకు, స్థానిక ఎమ్మెల్సీకు, దండం పెడుతూ వారు విన్నవించుకున్నారు.

దరఖాస్తు పెట్టినా సమస్య పరిష్కారం కాదు

రెవెన్యూ అధికారుల తీరుపై సర్వసభ్య సమావేశంలో సభ్యులు ధ్వజం

రెవెన్యూ అధికారిని నిలదీస్తున్న వైస్ ఎంపిపి

ప్రజాశక్తి - వంగర

రెవెన్యూ శాఖకు సంబంధించి ఉన్న సమస్యలు కోసం దరఖాస్తులు పెట్టినా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వర రావుతో పాటు, గీతనాపల్లి, రుషింగి తదితర గ్రామాలకు చెందిన సభ్యులు ధ్వజమెత్తారు. ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులు ఆమోదంతో ఇటీవల మరణించిన వైసిపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు పాలవలస రాజశేఖరం చిత్రపటానికి ముందుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెవెన్యూ శాఖకు సంబంధించిన చర్చలో పలువురు సభ్యులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల రెవెన్యూ అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విఆర్ఒలు ఏ సమస్య చెప్పినా పట్టించుకోవడంలేదని కనీసం కుల ధృవీకరణ పత్రం కోసం అధికారులు వారం రోజులు తిప్పుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశానికి తహశీల్దార్, సిఎస్‌డిటి, ఆర్ఎస్‌డిటి హాజరు కాకపోవడం ఏమిటని పలువురు సభ్యులు సభలో ప్రశ్నించారు. ఈ సభకు హాజరైన ఆర్ఐ రామారావు మాట్లాడుతూ ఈ విషయాలు తహశీల్దార్‌కు వివరిస్తామన్నారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు కనీసం సమాచారం ఇవ్వడం లేదని ఆ శాఖకు సంబంధించిన చర్చలో పలువురు సభ్యులు ఎఇని నిలదీశారు. గత ప్రభుత్వంలో వైఎస్ఆర్ పేరుతో మంజూరైన ఇళ్లకు కూటమి నాయకులు అజమాయిసి సాగిస్తున్నారని ఆరోపించారు. విద్యుత్తుశాఖకు సంబంధించిన చర్చలో ఎఇ సాంబశివరావు మాట్లాడుతూ మండలంలో కొత్తగా మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని అయినప్పటికీ లో వోల్టేజి సమస్య ఉందని ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు. తోటపల్లి కుడికాలువ ద్వారా ఏటా శివారు భూములకు సాగునీరు సక్రంగా అందటం లేదని పలువురు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ అధికారులు రాజకీయాలకు అతీతంగా పని చేసుకుంటే ఎంతో బాగుంటుందని సూచించారు. ఈ సమావేశంలో కరణం సుదర్శన్ రావు, ఎంపిడిఒ లోపింటి త్రినాధరావు, ఎంఇఒ జగదీశ్వరి, ఆర్ఐ బోనెల రామారావు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే 'కోళ్ల' జన్మదిన వేడుకలు

పేదలకు వస్త్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి క్యాంపు కార్యాలయంలో ఆమె జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు నాయకులు, ప్రభుత్వ అధికారులు తరలివచ్చారు. నియోజకవర్గంలో సామాన్యుల సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతరం పాటుపడతానని పార్టీని నాయకులకు ప్రజలకు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పార్టీ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు గొరపల్లి రాము అధ్యక్షతన విశాఖ పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షులు బొబ్బిలి అప్పారావు మాస్టర్ ఆర్థిక సహాయంతో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పుట్టినరోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఒంటరి వృద్ధులకు వస్త్ర దానం అన్నదానం చేసింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి హాజరై మాట్లాడారు. తన పుట్టినరోజు వేడుకలు ఇంత ఘనంగా జరిపించిన సోదర సమానులు బొబ్బిలి అప్పారావు మాస్టర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. నిరుపేదలకు అన్నదానం వస్త్ర దానం చేయడం చాలా ఆనందంగా వుందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పండగ వాతావరణంలో వేడుకలను నిర్వహించారు. సుమారు 2000 మందికి పైగా భారీ అన్నదానం నిర్వహించారు. వందమందికి పైగా ఒంటరి వృద్ధులకు వస్త్ర దానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, మాజీ జెడ్పిటిసి కరెడ్ల ఈశ్వరరావు, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కోళ్ల శ్రీను, చింతలపాలెం సర్పంచ్ మాకేన సీతారామ పాత్రుడు, లాలం అర్జున్ రావు, సీనియర్ నాయకుల రత్నాజీ, ఉమేష్, తుమికాపల్లి సర్పంచ్ అప్పలరాజు, విశాఖ పార్లమెంట్ బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కోరుపోలు అప్పారావు, రాష్ట్ర అయ్యారు కార్పొరేషన్ కన్వీనర్ బంగారు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకోటమ్మతల్లి పండగ

ఆకట్టుకున్న వేషధారణలు, మహిళల కోలాట నృత్యాలు

వివిధ వేశధారణలో కళాకారులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు, కొట్టాం గ్రామదేవత శ్రీకోటమ్మతల్లి పోతు పండగ మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. కోటమ్మ తల్లి అనుపోత్సవం సందర్భంగా వచ్చిన భక్తులు ముందుగా గ్రామంలోని గద్దె గుడిలో శ్రీకోటమ్మ ఉత్సవ మూర్తిని దర్శించుకుని సంప్రదాయంగా పసుపు, కుంకుమలతో పాటు చీరలు, రవికెలు సమర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేషధారణలు, నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

కోటమ్మవారి పోతు పండగ పురస్కరించుకుని పలువురు భక్తులు సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి, లవకుశ, వెంకటరమణమూర్తి, నారదమహర్షి, యమధర్మరాజు, చిత్రగుప్తుడు వంటి వేషధారణలు సుమారు 20 ట్రాక్టర్లతో ఒకదాని వెనుక ఒకటి లైనుగా ప్రదర్శించారు. ఆనవాయితీగా వస్తున్న ఈ వేషధారణలు గ్రామస్తులు వేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. గరగల నృత్యం, బిందెల నృత్యం, దేవతామూర్తుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి జి శ్రీనివాసరావు ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో అనుపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా గ్రామంలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

పేద రైతుకు న్యాయం చేయాలి

తహశీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న రామారావు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

చన మల్లు పేటలో ఆత్మహత్యాయత్నం చేసిన పేద రైతు చనమల్లు అబ్బద్దంకు రెవెన్యూ అధికారులు న్యాయం చేయాలని సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన తహశీల్దార్ కార్యాలయంలో ఆ రైతుకు న్యాయం చేయాలని తహశీల్దార్ సుదర్శనరావును కోరారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పేద రైతు అబద్దం భూములు ఆన్‌లైన్ చేయాలని డిమాండ్ చేశారు. చనమల్లపేట వెళ్లి రైతుని కలిశామని అయితే తన సాగులో ఉన్న భూమిలో కొన్ని సర్వే నెంబర్లు కాలనీ పేరు మీద ఉన్నట్లు రైతు చెప్పారన్నారు. ఆర్‌డిఒ రైతు భూములపై విచారణ జరిపి న్యాయం చేయాలని చెప్పినా ఇంతవరకు రైతు అబద్దంకి సాగు భూముల విషయంలో న్యాయం జరగలేదన్నారు. కాగా బాధిత రైతు రెవెన్యూ అధికారులంటే భయపడుతున్నాడని దీనిబట్టి బాధిత రైతుని రెవెన్యూ అధికార్లు భయపెట్టరాని అర్థమతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికార్లు స్పందించకపోతే అమరావతిలో డిప్యూటీ సిఎం పవన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీనిపై తహశీల్దార్ సుదర్శన రావు మాట్లాడుతూ చనమల్ల పేట రైతుకు న్యాయం చేస్తామని ఆయనకు సంబందించిన భూముల్లో 3 సర్వే నంబర్లు వేరే వారి పేరు మీద పడ్డాయని వాటిని సరిచేసి రైతు సాగులో ఉన్న భూములు వేరే వారు ఆక్రమించకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కె. పద్మనాభం పాల్గొన్నారు.

ఓటర్ల నమోదులో తప్పుల్లేకుండా చూడాలి

ప్రజాశక్తి- బాడంగి

ఓటర్ల నమోదులో తప్పులు లేకుండా చూడాలని బిఎల్ఒలను ఆర్‌డిఒ రామ్మోహనరావు కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఓటర్ల నమోదుపై బిఎల్ఒలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఓటర్ల నమోదు నిరంతరాయంగా జరగాలని చెప్పారు. ఓటర్ల చేర్పులు, తొలగింపు, ఓటు బదిలీ నిష్పక్షపాతంగా చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాను తప్పులు లేకుండా చేయాల్సిన బాధ్యత బిఎల్ఒలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుధాకర్, రెవెన్యూ సిబ్బంది, బిఎల్ఒలు పాల్గొన్నారు.

భూముల రీ సర్వే పక్కాగా నిర్వహించాలి

మండలంలోని భూముల రీసర్వేను పక్కగా నిర్వహించాలని బొబ్బిలి ఆర్‌డిఒ రామ్మోహనరావు అన్నారు. వాడాడ గ్రామంలో మంగళవారం తహశీల్దార్ ఆధ్వర్యంలో భూముల రీసర్వేపై అవగాహన ర్యాలీ, గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ సర్వేలో ఎటువంటి తప్పులు లేకుండా గ్రామ సర్వేయర్లు సర్వే చేయాలన్నారు. రైతులు, సహకరించాలని ఆయన కోరారు.

క్యూబా ప్రజలను ఆదుకునేందుకు ముందుకు రావాలి

బొబ్బిలి: అమెరికా ఆంక్షలతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న క్యూబా ప్రజలను ఆదుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు కోరారు. పట్టణంలో మంగళవారం క్యూబా సంఘీభావ నిధి వసూలు చేశారు. సామ్రాజ్యవాద ఆధిపత్యం కోసం అమెరికా క్యూబా ప్రజలను ఇబ్బందులు పెట్టేందుకు ఆహార పదార్థాలు, మందులు దిగుమతి అవ్వకుండా ఆంక్షలు పెట్టడంతో క్యూబా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. క్యూబా ప్రజలకు అన్ని వర్గాల ప్రజలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం పాల్గొన్నారు.

పన్నులు వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపాలిటీలో పన్నులు వసూళ్లలో నిర్లక్ష్యం వహించవద్దని కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ, మున్సిపల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మార్చి నెలాఖరులోగా పన్నులు చెల్లిస్తే 50శాతం వడ్డీ రాయితీ వస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఇంటింటికి వెళ్లి ఆస్తిపన్ను, కుళాయి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు వసూలు చేయాలన్నారు. పన్నులు వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ ఆర్ఒ నాగరాజు, ఆర్ఐ సురేష్, పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే షోకాజ్ నోటీసులు

విధుల్లో అలసత్వం వహించిన సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని మంగళవారం వంతరాం రోడ్డు, కుమ్మరివీధి సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధులకు సకాలంలో హాజరు కావడం లేదని, పన్నులు వసూలు లక్ష్యాలను చేరుకోలేదని గుర్తించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. ప్రతిరోజు ఉదయం 9గంటలకే విధులకు హాజరు కావాలని, పన్నులు వసూలు వేగవంతం చేయాలని కోరారు.

వడ్డీ రాయితీతో ఆస్థి పన్ను చెల్లించండి

నెల్లిమర్ల: నగర పంచాయతీలో వడ్డీ రాయితీతో ఆస్థి పన్ను చెల్లించవచ్చని కమిషనర్ కె. అప్పలరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీలో 50శాతం వడ్డీ రాయితీ ఆస్థి పన్ను చెల్లించవచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు జరిచేసినట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఆర్థిక సంవత్సరంలో ఈ నెల 31లోగా ఆస్థి పన్ను, ఖాళీ స్థలాలు పన్ను బకాయి ఉన్న వారు ఎక్కవ మొత్తంలో రాయితీతో చెల్లించవచ్చని చెప్పారు.